
సాక్షి నల్లగొండ

గురువారం । 7 । నవంబర్ । 2024



కేఆర్ఎంబీ సూచనలతో..

కేఆర్ఎంబీ సూచనలతోనే విద్యుదుత్పాదన చేస్తున్నట్లు విద్యుదుత్పాదన కేంద్రం సీఈ మంగేష్‌కుమార్‌నాయక్ తెలిపారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 586.20 అడుగులు
ఇన్‌ఫ్లో	: 7,075 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 40,934 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 24,888 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9,767 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 4,679 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,200
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	643.60 అడుగులు
ఇన్‌ఫ్లో	: 588.76 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 738.37 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 48 క్యూసెక్కులు
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచాలి



రికార్డు పరిశీలిస్తున్న సంధ్యారాణి

నాగార్జునసాగర్: క్రమశిక్షణతో కూడిన విద్య నందిస్తూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని బీసీ గురుకులాల నల్లగొండ ఉమ్మడి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ సంధ్యారాణి అన్నారు. బుధవారం నాగార్జునసాగర్‌లోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాన్ని సందర్శించారు. పలు రికార్డులు, తరగతి గదులు, వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థుల ఆహారం, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పీఈటీ గాయిత్రి, అధ్యాపకులు ఉన్నారు.

సబ్‌స్టేషన్‌కు తాళం వేసి గ్రామస్తుల నిరసన



సబ్‌స్టేషన్‌కు తాళం వేస్తున్న గ్రామస్తులు

వేములపల్లి(మాడ్గులపల్లి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో తమ ఇళ్లలోని విద్యుత్ పరికరాలు కాలిపోయాయని ఆరోపిస్తూ బుధవారం మాడ్గులపల్లి మండల కేంద్రం వాసులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి వెళ్లే తడకమళ్ల విద్యుత్ లైన్‌కు హైపవర్ సరఫరా కావడంతో తమ ఇళ్లలోని ఫ్రిజ్‌లు, టీవీలు, ఫ్యాన్‌లు కాలిపోయాయని, విద్యుత్ అధికారులను సంప్రదిస్తే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాగా విద్యుత్ కార్యాలయానికి తాళం వేయడంతో అధికారులు స్పందించి సమస్య పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని నచ్చజెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

23న మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మధుబాబు

నల్లగొండ: ఈనెల 23న మాల, మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని నల్లగొండలోని సాగర్ రోడ్డులో గల జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ లకుమల మధుబాబు తెలిపారు. నల్లగొండలోని శాంతినగర్‌లో గల మాల మహానాడు జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆ సమితి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి, సమితి రాష్ట్ర చైర్మన్ జి.చెన్నయ్య, కో చైర్మన్లు తాళ్లపల్లి రవి, మేక వెంకన్న, ఎర్రమళ్ల రాములు హాజరుకానున్న ఈ సమ్మేళనానికి మాలలు, మాల ఉద్యోగులు, కవులు, కళాకారులు, అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు చింతపల్లి లింగమయ్య, జిల్లా కమిటీ సభ్యులు భోగరి అనిల్, పురం వేణు, మాల ఎంప్లాయిస్ విభాగం కల్చరల్ సెక్రటరీ ఈసం యాదగిరి, రొయ్య కిరణ్, ముడుసు భిక్షం, అన్నిమల లింగస్వామి, గండమళ్ల విగ్నేష్ పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

భువనగిరి: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్- 19 ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం ముగిసాయి. ప్రథమ స్థానంలో టీజీఎంఎస్ తుర్కపల్లి, ద్వితీయ స్థానంలో హైదరాబాద్ జూనియర్ కళాశాల బొమ్మలరామారం, తృతీయ స్థానంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌జేసీ రాజపేట నిలిచాయి. విజేతలకు కప్‌తోపాటు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్, పీడీలు పాల్గొన్నారు.

• ఇంటికో స్టిక్కర్



సమగ్ర కుటుంబ సర్వే తొలి రోజు బుధవారం మిర్యాలగూడలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో ఇంటిగోడకు స్టిక్కర్ అంటించి వివరాలు సేకరిస్తున్న కమిషనర్ యుసుఫ్, ఎన్యూమరేటర్లు

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక

హుజూర్‌నగర్: కోదాడ పట్టణంలోని పబ్లిక్ ఆడిటోరియంలో గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్ -14, 17 విభాగాల్లో బాలబాలికలకు చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆజంబాబా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సంబంధిత పాఠశాలల హెచ్ఎం ధ్రువీకరించిన బోనోఫైడ్, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్, ప్రధాన కార్యదర్శి పోరుపల్లి చంద్రశేఖర్‌లకు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడారులు ఈ నెల 8న మేడ్చల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పత్తి తూకాల్లో మోసం!

రైతులను ముంచుతున్న వ్యాపారులు

- క్వింటాకు 10 నుంచి 15 కిలోలు అధిక తూకం
- కాంటాలను క్షుణ్ణంగా పరిశీలించని లీగల్ మెట్రాలజీ అధికారులు
- క్వింటాకు రూ.750 నుంచి రూ.1,125 వరకు నష్టపోతున్న రైతులు



మర్రిగూడలో పత్తిని కాంటా వేస్తున్న కార్మికులు (ఫైల్)

తప్పుడు తూకాలు వేస్తే చర్యలు

పత్తి తూకంలో తప్పుడు తూకాలు వేసి రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు అధిక తూకంపై ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. బాట్ల ముద్ర వేసుకోని ఎనిమిది మంది వ్యాపారులపై జరినామా విధించాం.

– శ్రీనివాస్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్

నల్లగొండ టూటౌన్: ఎండనకా.. వాననకా.. ఆరుగాలం కష్టించి పత్తిని పండించిన రైతన్న దళారుల చేతిలో చిత్తవుతున్నాడు. గతేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల కాలం కలిసిరాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారి కాలం కలిసొచ్చి పత్తిపంట చేతికొచ్చినా ప్రస్తుతం సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు దళారీ వ్యాపారుల ఆశ్రయించి పత్తిని అమ్ముకుంటున్నారు. ఈ నేపథ్యంలో దళారుల వద్ద తూకాల్లో మోసపోతూ నిలువునా నష్టపోతున్నారు. పత్తి విక్రయాలు ప్రారంభానికి ముందే లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు తనిఖీలు చేయడం, పత్తి కొనుగోలు చేసే వారిని హెచ్చరించడం లాంటివి చేయకపోవడంతో దళారీ వ్యాపారులు యథేచ్ఛగా రైతును మోసం చేస్తున్నారు. పత్తిని తూకం వేసే సమయంలో ఎక్కువ తూకం వేస్తూ అమాయక రైతులను నిండా ముంచుతున్నారు. రైతుల చేతికి పత్తి రాగానే దళారీ వ్యాపారులు ఊళ్లలో వాలిపోతుంటారు. సంబంధిత వ్యాపారులు ఊరికో బ్రోకర్‌ను పెట్టుకొని ఈ అక్రమ దందా నడుపుతూ నాలుగు చేతులా సంపాదిస్తున్నారు. అయినప్పటికీ జిల్లా అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుందే తప్ప ప్రత్యేక అధికారుల బృందాలను పెట్టి ఆకస్మిక తనిఖీలు చేసి కేసులు పెట్టిన దాఖలాలు లేవనే చెప్పాలి.

నిలువు దోపిడీ!

వేల రూపాయలు ఖర్చు చేసి పత్తిసాగు చేసిన రైతులకు ఒకపక్క మంచి దిగుబడులు రాక ఇబ్బందులు పడుతుంటే.. మరోపక్క దళారీ వ్యాపారుల చేతిలో నిలువు దోపిడీకి గురవుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో పత్తి వ్యాపారులు గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా శాలిగౌరారం మండలం ఆకారం, అడవిదేవులపల్లి, మునుగోడు, దామరచర్ల, చండూరు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పత్తి వ్యాపారం నడుస్తోంది. ఒక్కో క్వింటాకు 10 నుంచి 15 కిలోల పత్తి అధికంగా తూకం వేస్తూ రైతులను దోచుకుంటున్నారు. ఈ క్రమంలో క్వింటాకు రూ.750 నుంచి రూ.1,125 వరకు రైతులు నష్టపోతున్నారు. ఈ లెక్కన వంద క్వింటాళ్ల పత్తిని అమ్మితే రూ.లక్ష వరకు రైతు నష్టపోవాల్సి వస్తోంది. దళారీ వ్యాపారులను నిలువరించే వాళ్లు లేకపోవడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతోందనే చెప్పాలి. లీగల్ మెట్రాలజీ అధికారులు బాట్ల మీద ముద్రను తనిఖీ చేసుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు తప్పితే అధిక తూకంపై అంతగా దృష్టి సారించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారుల ఉదాసీనత వ్యవహారం కూడా దళారీ పత్తి వ్యాపారుల అక్రమాలకు అంతు లేకుండా పోయిందనే ఆరోపణలు ఉన్నాయి.

ఎలక్ట్రానిక్ కాంటాల్లో మాయ

బాట్ల కాంటాతో తూకాలు వేస్తే మోసం జరుగుతుందన్నది అందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడు ఎలక్ట్రానిక్ కాంటాలు అందుబాటులోకి రావడంతో దళారీ వ్యాపారులు రిమోట్ కంట్రోల్‌తో పత్తి అధికంగా తూకం వచ్చేలా చేస్తున్నారు. పత్తి బస్తా 115 కిలోలు ఉన్నా వంద కిలోల బరువు మాత్రమే చూపిస్తుంది. ఈ తతంగం గురించి రైతులతో పాటు చదువుకున్న వారికి కూడా ఏమాత్రం అవగాహన లేకపోవడంతో పత్తి వ్యాపారుల చేతిలో మోసపోతున్నారు. కాగా గ్రామాల్లో పత్తి కాంటా వేసే కాంటాలకు అసలు లీగల్ మెట్రాలజీ కార్యాలయం నుంచి కనీసం ముద్ర వేసుకున్న దాఖలాలు కూడా లేవు. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు కాంటాలు వినియోగిస్తూ పత్తి రైతులను మోసం చేస్తున్నారు.

యాదాద్రిలో శ్రీసుదర్శన హోమం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. వేకువజామున ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం చేశారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా శ్రీసుదర్శన నారసింహ హోమం జరిపారు. తరువాత గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం జరిపించి, ద్వారా బంధనం చేశారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు షూ అందజేస్తున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఈఓ భిక్షపతి, గోనారెడ్డి

• జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

కనగల్: విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం కనగల్ మండలం చిన్న మాదారంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన షూ పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, బాగా చదివే విద్యార్థులకు ప్రతీక్ ఫౌండేషన్ ఎంతో ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ కోచైర్మన్ ఎంపీ గోనారెడ్డి మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గతంలో ఈ పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలో భాగంగా షూలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పాఠశాలకు కావాల్సిన క్రీడల సామగ్రిని అందిస్తామని, తరగతి గదులకు రంగులు వేస్తామని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి బి.భిక్షపతి మాట్లాడుతూ ప్రతీక్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమన్నారు. విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో పది గ్రేడింగ్ పాయింట్లు సాధించి పాఠశాలకు మంచి పేరుతేవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం వి.పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కనగల్ మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేప నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

• డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

నల్లగొండ టౌన్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే, ప్రోత్సహించే వారిపై పీసీపీ ఎన్‌డీటీ యాక్టు ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఆయా స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం నల్లగొండలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన పీసీపీఎన్‌డీటీ యాక్టు సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనేక మండలాల్లో బాలబాలికల నిష్పత్తి గణనీయంగా తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని పరీక్షల్లో తేలగానే కొందరు అబార్షన్లు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భస్రావం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. గైనకాలజిస్టుల ప్రిస్కిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో ఎంటీపీ మాత్రలు అమ్మవద్దని, అమ్మితే వారి దుకాణాలను మూసివేయిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో జీజీహెచ్ గైనకాలజీ హెచ్ఓడీ డాక్టర్ స్వరూపారాణి, డాక్టర్ సుచరిత, డాక్టర్ వందన, డాక్టర్ అరుంధతి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, గీత, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి



నల్లగొండలోని బీటీఎస్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్



'సాక్షి'తో మాట్లాడుతున్న కలెక్టర్

- వివరాలు గోప్యంగా ఉంచుతాం
- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- నల్లగొండ, మునుగోడులో సామాజిక సర్వే పరిశీలన

నల్లగొండ: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. బుధవారం జిల్లాలో ప్రారంభమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నల్లగొండలోని బీటీఎస్ కాలనీలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచుతామని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సర్వే కోసం వచ్చిన ఎన్యూమరేటర్లకు వాస్తవ సమాచారాన్ని తెలపాలన్నారు. ఈ నెల 8వ తేదీ వరకు స్టిక్కర్లు అంటించి ఇళ్ల జాబితాను రూపొందించి అనంతరం సర్వే ఫార్మాట్‌లోని సుమారు 75 కాలమ్స్‌లో వివరాలు సేకరిస్తామన్నారు. ప్రజలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ధరణి పట్టాదారు పాస్ బుక్ వంటివి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించినట్లుగా స్టిక్కర్ అతికించాలని చెప్పారు. మూడు స్థాయిల్లో సర్వేను పర్యవేక్షించేందుకు సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేక అధికారి లేదా మున్సిపల్ కమిషనర్, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ నోడల్ అధికారులుగా నియమించామన్నారు. అంతేకాకుండా రోజూ టెలికాన్ఫరెన్స్, ఆకస్మిక తనిఖీల ద్వారా సర్వేను పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము తనిఖీ

జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాం వద్ద ఏర్పాటుచేసిన సెక్యూరిటీ, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నెలవారీ సాధారణ తనిఖీల్లో భాగంగా పరిశీలించినట్టు అధికారులు తెలిపారు. ఆమె వెంట కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు విజయ్, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

వేరు కాపురం ఉంటేనే కుటుంబంగా గుర్తించాలి



గూడపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

మునుగోడు: తల్లిదండ్రుల నుంచి విడిపోయి వేరు కాపురం ఉంటేనే నూతన కుటుంబంగా గుర్తించాలనికలెక్టర్ ఇలా త్రిపాఠి ఎన్యుమరేటర్లకు సూచించారు. బుధవారం ఆమె మునుగోడు మండలం గూడపూర్ గ్రామంలో ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. పది ఇళ్లకు నేరుగా వెళ్లిన ఆమె సర్వే సిబ్బంది మీ ఇంటికి వచ్చారా.. మిమ్మల్ని ఏమైనా ప్రశ్నలు అడిగారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్వే చేస్తున్న తీరుని పలిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు, పక్కవారు చెబితే ఆ వివరాలను నమోదు చేయవద్దన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం

గూడపూర్‌లో సర్వే పరిశీలనకు కలెక్టర్ వచ్చిన సమయంలో పంచాయతీ కార్యదర్శి సరిత అందుబాటులో లేకపోవడం, ఒకే ఇంటికి రెండు, మూడు స్టిక్కర్లు ఉండడం.. గ్రామంలో పారిశుద్ధ్యలోపాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు గ్రామాన్ని సందర్శిస్తానని అప్పటిలోగా పారిశుద్ధ్య లోపం ఉండొద్దని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె మునుగోడు మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు కార్తికేయ కాటన్ మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి నిబంధనల ప్రకారం తేమ ఉండేలా తమ వడ్లు, పత్తిని ఆరబెట్టుకొని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎం.నరేందర్, ఎంపీడీఓ విజయభాస్కర్, ఆర్ఐ రామచంద్రయ్య, చండూరు మార్కెట్ కార్యదర్శి రవి, సీసీఐ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ఉన్నారు.

ట్యాబ్ ఎంట్రీలో జాప్యం చేయొద్దు

• అదనపు కలెక్టర్ శ్రీనివాస్



నకిరేకల్ : తాటికల్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, డీఎస్ఓ తదితరులు

నకిరేకల్, కేతేపల్లి: జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొన్న ధాన్యం వివరాల ట్యాబ్ ఎంట్రీలో జాప్యం చేయొద్దని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. నకిరేకల్ మండలం తాటికల్, చీమలగడ్డతోపాటు కేతేపల్లి మండలం ఇనుపాములలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ బుధవారం డీఎస్ఓ వి.వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులు, నిర్వాహకులతో ముఖాముఖి మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 శాతం తేమతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని నిర్వాహకులను సూచించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. వారి వెంట సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరీష్, నకిరేకల్ తహసీల్దార్ జమురుద్దీన్, కేతేపల్లి ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, డీటీ సత్తార్, ఆర్ఐ చాంద్‌పాషా, ఏఓ బి.పురుషోత్తం, పీసీఎస్ సిబ్బంది తండు వెంకన్న ఉన్నారు.

ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలి

• డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నల్లగొండ: మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రమాద బీమా, రుణ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలపై సెర్ప్, స్త్రీ నిధి సిబ్బందికి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండలోని టీటీడీసీ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రమాద బీమా, రుణబీమా ద్వారా మహిళా సభ్యులకు కలిగే లాభాలను వివరించారు. రుణ బీమా సౌకర్యం ఈ సంవత్సరం మార్చి నుంచే అమలులోకి వచ్చిందన్నారు. సంఘాల్లోని సభ్యులు సహజంగా మరణిస్తే బ్యాంకు నుంచి పొందిన అప్పు నిల్వలో గరిష్ఠంగా రూ.2లక్షల వరకు బీమా వర్తిస్తుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల బీమా అందనుందన్నారు. ప్రమాదం కారణంగా పాక్షిక వైకల్యం (50శాతం) సంభవిస్తే రూ.5 లక్షల వరకు బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇందుకు మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, సంఘం తీర్మాన పత్రం, గ్రామ సంఘం తీర్మానం, సభ్యురాలి సంఘం అప్పు, పొదుపు ఖాతాల బ్యాంకు స్టేట్‌మెంట్ (బ్యాంకు అధికారి సంతకంతో), సభ్యురాలి పాస్ పోర్ట్ సైజు ఫొటో, ఎఫ్ఐఆర్ కాపీ అదనంగా జతపర్చాలని తెలిపారు. సమావేశంలో జోనల్ మేనేజర్ అనంత కిషోర్, డీపీఎంలు, ఆర్ఎం, ఏపీఎంలు, సీసీలు, స్త్రీనిధి సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్: గ్రామ పంచాయతీ (జీపీ) కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జీపీ కార్మికులకు నెలకు కనీస వేతనంగా రూ.19 వేలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికులకు రెండు మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో వినోద్‌కుమార్, సర్వయ్య, అరుణ, సైదులు, ఎల్లేష్, ఆశీర్వాదం, కోటయ్య, స్వప్న, జహీర్, నర్సింహ, జ్యోతి, జానయ్య పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ.13.82లక్షలు



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. 87 రోజులకు గాను రూ.13,82,680 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్య, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ బి.సుమతి తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీహెచ్.వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సీహెచ్.నగేష్‌గౌడ్, మాజీ చైర్మన్ ఎస్.ముత్తయ్య, సీనియర్ అసిస్టెంట్లు జె.చంద్రయ్య, జి.నాగేశ్వర్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు కె.ఉపేందర్‌రెడ్డి, కె.రాజయ్య, ఎస్.ఆంజనేయులు, జె.నాగరాజు, సీహెచ్.శ్రీకరణ్, ఎం.రాజు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

1104 యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాసయ్య


యాసయ్య

నాగార్జునసాగర్: జెన్‌కో విద్యుత్ ఉద్యోగుల 1104 యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగార్జునసాగర్ జెన్‌కో రీజియన్‌కు చెందిన యాసయ్య ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జెన్‌కో రాష్ట్రస్థాయి ఎన్నికల్లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కె. కోటేశ్వర్‌రావు, కార్యదర్శులుగా దుర్గ, అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాసయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యాసయ్య మాట్లాడుతూ.. జెన్‌కోలో 1104 యూనియన్ బలోపేతానికి కృషిచేస్తానని, ఆర్టీజన్, ఓఅండ్‌ఎం, అకౌంట్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయగా పనిచేస్తానని తెలిపారు.

ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌నకు ఎంపికైన జాన్‌పాషా


ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్‌తో జాన్‌పాషా

నడిగూడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి షేక్ జాన్‌పాషా ప్రీ రిపబ్లిక్ డే–2024 క్యాంప్ కంటిజెంట్ లీడర్‌గా తెలంగాణ రాష్ట్రం తరఫున ఎంపికయ్యారు. ఈ నెల 12వ తేదీ నుండి 21వ తేదీ వరకు మహారాష్ట్రలోని జలగావ్‌లో గల కేబీసీ నార్త్ మహారాష్ట్ర విశ్వవిద్యాలయంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రీ రిపబ్లిక్ క్యాంప్‌లో ఆయన పాల్గొననున్నారు. జాన్‌పాషాను కళాశాల ప్రిన్స్‌పాల్ డి. విజయ నాయక్, అధ్యాపకులు అభినందించారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌ను జాన్‌పాషా బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

భువనగిరి బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భువనగిరి క్రైం: భువనగిరి బస్టాండ్‌లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. బస్టాండ్ నుంచి బయటకు వెళ్లే దారిలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బస్టాండ్ వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 40ఏళ్లు ఉంటుందని, నారింజ రంగు టీషర్టు, నీలం రంగు ప్యాంట్ ధరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చి ఆర్టీసీ కంట్రోలర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712662803 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తల్లిపై దాడి చేసిన కుమారుడు

మేళ్లచెరువు: ఇంటి స్థలం విషయమై తమ్ముడితో గొడవపడుతున్న అన్నకు తల్లి సర్దిచెప్పేందుకు యత్నించగా.. ఆమెపై పెద్ద కుమారుడు దాడి చేశాడు. ఈ ఘటన మేళ్లచెరువు మండలం వెల్లటూరు గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లటూరు గ్రామానికి చెందిన సైదమ్మకు ఇద్దరు కుమారులు సువర్ణరాజు, నాగరాజు ఉన్నారు. సైదమ్మ చిన్న కుమారుడు నాగరాజు వద్ద ఉంటోంది. బుధవారం పెద్ద కుమారుడు సువర్ణరాజు ఇంటి స్థలం విషయమై తమ్ముడు నాగరాజుతో గొడవ పడుతున్న క్రమంలో సైదమ్మ వారిద్దరికి సర్దిచెప్పేందుకు యత్నించగా.. సువర్ణరాజు ఆమెను కర్రలు, రాళ్లతో కొట్టాడు. సైదమ్మ తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం చిన్న కుమారుడు నాగరాజు తొలుత ఆమెను హుజూర్‌నగర్ ఆస్పత్రికి అక్కడి నుంచి కోదాడ ఆస్పత్రికి తరలించాడు. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సువర్ణరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పరమేష్ తెలిపారు.

కేఆర్‌ఎంబీ సూచనలు పాటిస్తూనే విద్యుదుత్పాదన

నాగార్జునసాగర్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి నీటిని వినియోగిస్తూ చేస్తున్న విద్యుత్ ఉత్పాదనను నిలిపివేయాలని రెండు రోజుల క్రితం కేఆర్‌ఎంబీ(కృష్ణానది యాజమాన్య బోర్డు) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సూచనలు చేసింది. జలాశయాలలోని నీటిని తాగు, సాగుకు మాత్రమే వినియోగించాలని సూచించింది. అయితే, నాగార్జునసాగర్‌లోని ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో కేఆర్‌ఎంబీ సూచనలు పాటిస్తూనే రాష్ట్ర అవసరాల మేరకు విద్యుదుత్పాదన చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పాదన కేంద్రం చీఫ్ ఇంజనీర్ మంగేష్‌కుమార్‌నాయక్ తెలిపారు. ఎడమ కాలువకు సాగుకు నీటిని విడుదల చేస్తున్న సమయంలోనే ఆ కాల్వపై గల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పాదన కొనసాగిస్తున్నామన్నారు. గత వారం వరకు సాగర్ జలాశయానికి వరద వచ్చింది. ఇటీవలే ఎగువ నుంచి వరద తగ్గింది. జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 586.20 అడుగుల(301.3570టీఎంసీలు) నీరు ఉంది. మరో పదిహేను రోజుల్లో ఆయకట్టులో వానాకాలం పంట చేతికి రానుంది. నీటి అవసరాలు తగ్గనున్నాయి. ఇప్పటికే ఎడమ కాల్వకు నీటిని తగ్గించారు.


నాగార్జునసాగర్‌లోని ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం


విద్యుదుత్పాదన కేంద్రంలో సంబరాల్లో పాల్గొన్న జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్‌నాయక్, అధికారులు

లక్ష్యానికి మించి విద్యుదుత్పాదన

నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై గల విద్యుదుత్పాదన కేంద్రంలో రెండు టర్బైన్ల ద్వారా 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 69 మెగావాట్ల విద్యుదుత్పాదన చేయాల్సి ఉండగా.. ఏడు నెలల కాలంలోనే లక్ష్యాన్ని అధిగమించినట్లు తెలంగాణ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ మంగేష్‌కుమార్ నాయక్ తెలిపారు. బుధవారం ఆయన ఎడమకాల్వ విద్యుదుత్పాదన కేంద్రంలో ఉద్యోగులతో కలిసి కేక్‌కట్ చేసి సంబురాలు జరిపారు. సాగునీటి కోసం ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసే సమయంలో మాత్రమే టర్బైన్ల ద్వారా విద్యుదుత్పాదన చేసి లక్ష్యాన్ని అధిగమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ రాజేష్, ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈలు లింగారెడ్డి, మణిదీప్, క్రాంతిభూషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కేతేపల్లి: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కేతేపల్లి మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణానికి చెందిన గుడిపాటి నాగరాజు బుధవారం ఉదయం బైక్‌పై సూర్యాపేటకు వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో కేతేపల్లిలోని మూసీ కుడి కాల్వ సమీపంలోకి రాగానే ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ రెండు ముక్కలుగా విరిగిపోయింది. బైక్‌పై ప్రయాణిస్తున్న నాగరాజు చెయ్యి విరగడంతో పాటు తలకు బలమైన గాయాలయ్యాయి. నాగరాజును చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నాగరాజును కుటుంబ సభ్యులు నల్లగొండకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ తెలిపారు.


చికిత్స పొందుతున్న నాగరాజు

వివాహితపై కత్తితో దాడి చేసిన వ్యక్తి రిమాండ్

కోదాడరూరల్: కోదాడ పట్టణంలో మంగళవారం వివాహితపై కత్తితో దాడి చేసిన ఆర్‌ఎంపీ కొండపల్లి బాబును పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను కోదాడ పట్టణ సీఐ రాము బుధవారం విలేకరులకు వెల్లడించారు. శేషగాని రేణుక, ఆమె భర్త సతీష్ ఆరు నెలలుగా కోదాడ పట్టణంలోని నయానగర్‌లో నివాసముంటున్నారు. రేణుక అనారోగ్యానికి గురైనప్పుడు స్థానికంగా ఆర్‌ఎంపీగా పనిచేస్తున్న కొండపల్లి బాబు వద్ద చూపించారు. ఇదే అదునుగా భావించిన బాబు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఈ విషయం భర్తతో చెప్పగా అతను ఆర్‌ఎంపీని పద్ధతి మార్చుకోవాలని చెప్పాడు. మంగళవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న రేణుక వద్దకు బాబు వెళ్లి లైంగికంగా వేధించగా ఆమె తిరస్కరించింది. దీంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె గొంతు కోసి హత్య చేయడానికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో బాబు అక్కడి నుంచి పరారయ్యాడు. రేణుక భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని బుధవారం బాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


నిందితుడిని చూపుతున్న సీఐ రాము

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చిలుకూరు: నాగుల చవితి సందర్భంగా ఆలయానికి ఏర్పాటు చేసిన మైక్ సెట్, లైటింగ్‌ను తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చిలుకూరు మండలం కొండాపురం గ్రామంలో బుధవారం జరిగింది. మృతుడు బంధువులు, పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. కొండాపురం గ్రామానికి చెందిన యరమళ్ల నాగరాజు(41) కూలీ పనులతో పాటు పండుగలు, శుభకార్యాలకు మైక్ సెట్ పెడుతూ జీవనం సాగిస్తున్నాడు. నాగుల చవితి సందర్భంగా మంగళవారం గ్రామంలోని నాగదేవత ఆలయానికి మైక్ సెట్, లైటింగ్‌లు ఏర్పాటు చేశాడు. బుధవారం వాటిని తీసేందుకు గాను నాగరాజు తన కుమారుడిని తీసుకుని ఆలయం వద్దకు వెళ్లాడు. మైక్ సెట్, లైటింగ్ తీసేందుకు గాను ఇనుప నిచ్చెన సహాయంతో నాగరాజు దేవాలయం పైకి ఎక్కుతుండగా.. పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు నిచ్చెనకు తగిలి విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే తన కుమారుడు గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి వెంటనే నాగరాజును కోదాడ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పెద్దఅడిశర్లపల్లి: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడారు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట గ్రామ స్టేజీ వద్ద బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంగడిపేట గ్రామ స్టేజీ వద్ద నివాసముంటున్న కాడావత్ బాలు సమీపంలో కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి కిరాణ దుకాణం మూసి ఇంటికి వెళ్లే సరికి తాళం తీసి ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు బీరువా తెరిచి అందులోని రూ.92వేలను అపహరించుకుపోయినట్లు బాలు గుర్తించాడు. బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

మూడు తులాల బంగారం, 20 తులాల వెండి..

ఆత్మకూర్(ఎస్): తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన బుధవారం ఆత్మకూర్(ఎస్)మండలం ఏపూరు గ్రామంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపూరు గ్రామానికి చెందిన చింతరెడ్డి వీరారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. వ్యవసాయ పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి రాగా తాళం పగుగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువాలో దాచిన మూడు తులాల బంగారం, 20తులాల వెండి వస్తువులు, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

మునగాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం ముకుందాపురం గ్రామ శివారులో బుధవారం ఓ కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో డ్రైవర్‌తో పాటు మరో నలుగురు ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ కారును అతివేగంగా నడపడంతో ముకుందాపురం గ్రామ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదుట అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న ఎవరికీ గాయాలు కాలేదు. స్థానికులు కారులోని వారిని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.


కారులో నుంచి ప్రయాణికులను బయటకు తీసుకొస్తున్న స్థానికులు

నాటుసారా పట్టివేత


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనం, నాటుసారాను చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

మద్దిరాల: ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న నాటుసారాను మద్దిరాల మండలం మామిండ్లమడవ గ్రామ శివారులో బుధవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ రజిత తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ నర్సింహులపేట మండలం రాంపురం గ్రామం నుంచి ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై నాటుసారాను తుంగతుర్తి మండలం మామిండ్లమడవ గ్రామానికి తీసుకొస్తూ గ్రామ శివారులో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులను చూసి బైక్‌ను వదిలి పరారయ్యాడు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి 5 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జయప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని కొట్టిన ప్రిన్సిపాల్

తుంగతుర్తి: గురుకుల విద్యార్థిని ప్రిన్సిపాల్ అకారణంగా కొట్టడంతో విద్యార్థిని తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఈ ఘటన తుంగతుర్తి మండల కేంద్రంలో బుధవారం జరిగింది. తుంగతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఉదయ్‌ను పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్ అకారణంగా వీపుపై బెత్తంతో కొట్టాడు. సదరు విద్యార్థి తల్లిదండ్రులకు విషయం చెప్పగా.. పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులు తమ కుమారుడిని ఎందుకు కొట్టావని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. దీంతో తప్పయ్యిందని క్షమాపణ కోరుతున్నానని ప్రిన్సిపాల్ విద్యార్థి తల్లిదండ్రులకు తెలపడంతో వివాదం సద్దుమణిగింది. ఉదయ్‌ను తల్లిదండ్రులు తమ వెంట ఇంటికి తీసుకుని వెళ్లారు.

రేషన్ బియ్యం వ్యాపారికి రిమాండ్

వేములపల్లి(మాడ్గులపల్లి): మాడ్గులపల్లికి చెందిన సన్నిధి రమణ కొంతకాలంగా మిర్యాలగూడ పట్టణంతో పాటు పరిసర మండలాల్లో తక్కువ ధరకు రేషన్ లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బయట ఎక్కువ ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. పక్కా సమాచారం మేరకు రమణను అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు తరలించగా న్యాయమూర్తి అతడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. రమణపై మిర్యాలగూడ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో రేషన్ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కేసులు ఉన్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తులపై కేసు

తిప్పర్తి: కోడి పందేలు నిర్వహిస్తున్న వారిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. తిప్పర్తి ఎస్‌ఐ సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని హ్యాపీ హోమ్స్ సమీపంలో బుధవారం ఏడుగురు వ్యక్తులు రెండు కోడిపుంజులతో బెట్టింగ్ పెట్టి కోడి పందేలు నిర్వహిస్తుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.3వేలు నగదు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పందేలు నిర్వహిస్తున్న దాచేపల్లి శేషగిరిరావు, పఠాన్ వలీ, వనం సాయి, మురళి, మేస్త్రి శ్రీను, ప్రశాంత్, రామలింగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గంజాయి, డ్రగ్స్ కాల్చివేత

భువనగిరి క్రైం: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 43 కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను భువనగిరి మండలం తొక్కాపూర్ గ్రామంలో గల హోం ఇండస్ట్రీస్ మేనేజింగ్ బయోకెమికల్ కంపెనీలో బుధవారం కాల్చివేశారు. 848 కేజీల గంజాయి, 3 ఎల్‌ఎస్‌డీ బాస్ట్, 50 ఎండీఎంఏ పిల్స్, 900 గ్రాముల అల్ప్రోజోలం, 600 గ్రాముల క్లోరోహైడ్రేడ్, 700 గ్రాముల హాష్ ఆయిల్ దహనం చేసినట్లు మల్కాజ్‌గిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. నవీన్‌కుమార్, ఘట్కేసర్ ఎక్సైజ్ సీఐ జె. రవి తెలిపారు.

మూసీ పునరుజ్జీవంతో ఆరోగ్యం, అభివృద్ధి

వలిగొండ: మూసీ నది కాలుష్య కాసారంగా మారిందని, దీని పునరుజ్జీవంతోనే ప్రజారోగ్యం, అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వలిగొండ మండలంలోని సంగెం సమీపంలోని భీమలింగం కత్వ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టనున్న మూసీ పునరుజ్జీవ పాదయాత్ర సందర్భంగా పాదయాత్ర మార్గంతోపాటు, బహిరంగ సమావేశ ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాటు పనులను బుధవారం వారు అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను నేరుగా కలిసి మూసీ కష్టాలను తెలుసుకుని సమస్యలు పరిష్కరించేందుకే మూసీ పునరుజ్జీవ పాదయాత్ర చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, రాచకొండ పోలీస్ కమిషనర్ సురేంద్ర బాబు, భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, ఏసీపీ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంగెం వద్ద సీఎం పాదయాత్ర చేయనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. యువకుడు మృతి

కొండమల్లేపల్లి: బైక్ వెళ్తున్న యువకుడు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. చందంపేట మండలం గాగిళ్లాపురం గ్రామానికి చెందిన తిరుమల పర్వతాల, పద్మ దంపతులకు కుమారుడు అజయ్‌కుమార్(20), కుమార్తె ఉన్నారు. వీరు కొండమల్లేపల్లి మండల కేంద్రానికి 15 సంవత్సరాల క్రితం వలస వచ్చి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అజయ్‌కుమార్ హైదరాబాద్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం తల్లిదండ్రులకు చెప్పకుండానే అజయ్‌కుమార్ హైదరాబాద్ నుంచి కొండమల్లేపల్లికి వచ్చి రాత్రి తన స్నేహితుడు పుట్టినరోజు వేడుకలకు హాజరై తిరిగి మరో స్నేహితుడు కార్తీక్‌ని తన బైక్‌పై కూర్చొబెట్టుకొని కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని సాగర్ రోడ్డులో గల తన ఇంటికి వెళ్తుండగా.. బైక్ అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అజయ్‌కుమార్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న కార్తీక్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి పర్వతాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.


అజయ్ (ఫైల్)

డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తూ..

వలిగొండ: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలం ఆరూర్‌లో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరూర్ గ్రామానికి చెందిన సారగండ్ల నవీన్‌కుమార్(27) చౌటుప్పల్ మండలం ఎస్. లింగోటం గ్రామ సమీపంలోని ప్రతిష్ఠా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజు మాదిరిగా మంగళవారం రాత్రి డ్యూటీ ముగిసిన తర్వాత బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా ఆరూర్ సమీపంలోని శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయం సమీపంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. రోడ్డు వెంట వెళ్తున్న వారు అతని ఫోన్ సహాయంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు


ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులను తిలకిస్తున్న రైతులు

గరిడేపల్లి: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా నేలతో పాటు మనుషులు కూడా ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి ప్రేమికుడు సురేష్ గుప్తా అన్నారు. బుధవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవీకేలో ఏర్పాటు చేసిన ప్రకృతి ఉత్పత్తుల స్టాళ్లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు తమకున్న భూమిలో కొద్ది మొత్తంలోనైనా ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. దేశీ ఆవులను పెంచుకుంటూ ఆవు పేడ, ఆవు మూత్రంను ఉపయోగించుకొని సహజ సిద్ధమైన పద్ధతులతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చునని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి. నరేష్ మాట్లాడుతూ.. కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై ఎప్పటికప్పుడు శిక్షణ మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లయోలా అకాడమీ అగ్రికల్చర్ ఇన్‌చార్జి, జె. థామస్, కేవీకే శాస్త్రవేత్తలు ఎ. కిరణ్, సీహెచ్. నరేష్, టి. మాధురి, ఎన్. సుగంధి, నరేష్, ఎం. రాగిణి, జమీనా, ఉదయ్ భార్గవ్, రైతులు పాల్గొన్నారు.

80 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన బొలేరో వాహనాలు, రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

మఠంపల్లి: 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మూడు బొలేరో వాహనాల్లో ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తుండగా మఠంపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మఠంపల్లి ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని వివిధ గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మూడు బొలేరో వాహనాల్లో మట్టపల్లి మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుండగా.. పక్కా సమాచారం మేరకు పెదవీడు వద్ద పోలీసులు పట్టుకున్నారు. మూడు బొలేరో వాహనాలతో పాటు పట్టుబడిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం బోటిమీదితండాకు చెందిన బడావత్ సురేష్ బుధవారం బైక్‌పై నడిగూడెం మండలం సిరిపురం గ్రామం నుంచి నాలుగు బస్తాల్లో రేషన్ బియ్యాన్ని కూసుమంచి మండలం రాజపేటకు తరలిస్తుండగా స్థానిక పోలీసులు, సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. సురేష్‌ను విచారించడంతో రాజపేటకు చెందిన దాసరి వెంకటేష్ ఇంటికి తరలిస్తున్నానని, అక్కడ ఇంకా బియ్యం ఉన్నాయని చెప్పాడు. దీంతో వెంకటేష్ ఇంట్లో ఉన్న 28 బస్తాల బియ్యం, సురేష్ వద్ద ఉన్న నాలుగు బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ జి. అజయ్‌కుమార్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ రాంరెడ్డి తెలిపారు.

మేనల్లుడి వివాహానికి కేటీఆర్‌ను ఆహ్వానించిన కంచర్ల

నల్లగొండ టుటౌన్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కలిసి తన మేనల్లుడి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిషోర్, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.


కేటీఆర్‌తో కంచర్ల భూపాల్‌రెడ్డి మేనల్లుడు, మాజీ ఎమ్మెల్యేలు

పాల లెక్కల్లో తేడాలు

- సొసైటీల ద్వారా సేకరించిన పాలకు, శీతలీకరణ కేంద్రాల్లో వాస్తవ పరిమాణాలకు వ్యత్యాసం
- ఇటీవల మోత్కూరులోని కేంద్రాన్ని తనిఖీ చేసిన నార్మాక్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్
- కేంద్రం మేనేజర్‌తో సహా ఇద్దరు సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ

పొరపాట్లు గుర్తించారు

మోత్కూర్‌లోని పాలశీతలీకరణ కేంద్రంలో గత నెల 24న మదర్ డెయిరీ చైర్మన్, ఎండీ తనిఖీ చేశారు. చిన్నచిన్న పొరపాట్లను గుర్తించారు. ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోలేదు. మా సిబ్బంది కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు.

– ఎల్లయ్య, మోత్కూర్ పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్

మోత్కూరు: మదర్ డెయిరీ పరిధిలోని పాల శీతలీకరణ కేంద్రాలు, పాల సొసైటీల్లో అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల మోత్కూరు పాల శీతలీకరణ కేంద్రంలో నార్మాక్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ తనిఖీలు చేపట్టగా.. సొసైటీల ద్వారా సేకరించిన పాలకు, శీతలీకరణ కేంద్రాల్లో వాస్తవ పరిమాణాలకు తేడా ఉండడాన్ని గుర్తించారు. దీంతో మోత్కూరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్‌తో పాటు ఇద్దరు సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

వ్యత్యాసం రావడంతో..

మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ గత నెల 24న మోత్కూరు పాలశీతలీకరణ కేంద్రాన్ని సందర్శించి పాల సేకరణ నమోదు, రికార్డులను పరిశీలించారు. అదే నెల 26న ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో పాల కేంద్రాన్ని పరిశీలించారు. అక్టోబర్ 20వ తేదీన 26.5 లీటర్లు, 21న 25.0 లీటర్లు, 22న 24.0 లీటర్లు, 23న 25.5 లీటర్లు, 24న 11.0 లీటర్ల వ్యత్యాసం ఉంది. దీంతో మోత్కూరు పాలశీతలీకరణ మేనేజర్ ఎల్లయ్య, ప్రాసెసింగ్ సూపర్‌వైజర్ చంద్రయ్య, ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ వాస్తవం కంటే అదనపు పరిమాణాలు నమోదు చేస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు మేనేజర్ ఎల్లయ్య, ఇద్దరు సూపర్‌వైజర్లు చంద్రయ్య, శ్రీనివాస్‌లకు మదర్ డెయిరీ ఎండీ కృష్ణ ఈ నెల 30న షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా అడ్డగూడూరు మండలంలోని కోటమర్తి పాల సొసైటీలో కూడా పోతిరెడ్డిపల్లి తరహాలోనే అక్రమాలు జరిగినట్లు గుర్తించామని ఎండీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంతే కాకుండా చౌటుప్పల్ పాలశీతలీకరణ కేంద్రాన్ని ఈ నెల 2న మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి సందర్శించగా. పాల సొసైటీల ద్వారా సేకరించిన పాలకు, శీతలీకరణ కేంద్రంలో వాస్తవ పరిమాణాలకు అదనంగా నమోదు చేయడాన్ని గుర్తించారు. బాధ్యులైన ప్లాంట్ మెకానిక్, కేంద్రం మేనేజర్ సీహెచ్ వెంకట్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ మదర్ డెయిరీ ఎండీ కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు.